నేనూ మా కాంతం

నువ్వు వెయ్యి చెప్పు లక్ష చెప్పు నేను ఈరోజు ఇట్లో భోజనం చెయ్యను, భోజనం ఏమిటి, పచ్చిమంచినీళ్ళు తాగను. కాకపోయినా నీఆగడం ఎక్కువైపోయింది. ఎన్నాళ్ళని భరించి ఊరుకోనేది. నాకు ఈరోజు ఇంట్లో భోజనం చెయ్యటానికే మనస్కరించటంలేదు. నేను హోటలుకు పోక మానను.

క్షమించండి—నేనేమన్నాను.

క్షమించటం అన్నమాట నా చెవిని పడకూడదు. ఒంటరిగా ఏకాంతంలో ఎన్ని పరాభవాలన్నా భరిస్తాముగాని పద్ధిమంది స్నేహితులలోనూ నన్ను పరాభవంచేస్తే నేనేమిటి చేసేది అన్నాను. క్రిందటి రాత్రి జరిగిన పరాభవం తల్చుకొని కోపంచేత ఒళ్ళు మండిపోయి ఆరోజు హోటలుకు వెళ్ళాను. అంతకు పూర్వం ఎన్నో పరాభవాలు అనుభవించి పొట్టలో పెట్టుకొని ఊరుకొన్నాను. నేను కోపదారినే అంటారా?

కాంతంతో పోట్లాట ఎందుకు? ఎల్లాగో సద్దుకుపొండి అంటాడు. ఎలాగు? భర్తను గౌరవించటం పోయింది సరిగదా పైగా నన్ను వెంకట్రావూ—వెంకట్రావూ అని చులకన చేసి నెమ్మదిగా పిలవటం. వినపడదు అనుకొంటుంది. కాబోలు వెఱ్ఱిబాగులది.

పోనీ దానికేమని ఊరుకొన్నాను. నా తలగుడ్డ చూచి

పకపక నవ్వటం ఎందుకు? విద్యార్థిగానున్న అవస్థలో తల పాగ చుట్టిన పాపాన పోలేదు. 'ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన తరువాత తప్పని సరిగా చుడుతున్నాను. అదినాకు కుదరదు. ఒకమాటు చుటితే రోకలికి చుట్టినట్లు అవుతుంది. మరోమారు అరవవాడి తలగుడ్డ కిందికి తేలుతుంది. ఛా! బాగుంది కాదని శ్రద్ధగా చుడితే పాములవాడి పాగా ఆకారం ధరిస్తుంది. గ్రీకు పురాణ కథలలో ఒక గొల్లవాడు ఉన్నాడు. వాడికి భవిష్యత్తు చెప్పే నేర్పుఉంది. కాని వాడిని పట్టుకొంటే వాడు చెప్పక అనేక భయంకరమైన రూపములను పొంది తన దగ్గరకు వచ్చినవాళ్ళను భయపెట్టవలెనని చూస్తాడు. ఆ పట్టుకొన్నవాడు భయపడక అల్లాగే పట్టుకొని ఉంటే అప్పుడు తన నిజస్వరూపాన్ని దాల్చి భవిష్యత్తు చెపుతాడు. ఆగొల్లవాడు నాతలగుడ్డ అవతారం ఎత్తాడేమోనని నాకు అనుమానం. ఏదైన అవుతుందికాని ఇదినిజస్వరూపందాల్చి బడిపంతులు తలగుడ్డ మాత్రం కాదు. అట్లా నేను అవస్థపడుతుంటే నాకు సహాయం చేయుడంలేకపోగా దొడ్డిగుమ్మంలోనుంచొని విరగబడి నవ్వితే నాకెల్లా ఉంటుంది.

అటువంటి సమయంలో సహించి ఊరుకోటమే సుగుణం. కొన్నికొన్ని సమయాలలో నోరెత్తటానికి వీలులేదు. ఒక రోజున రాక రాక పరిషత్పత్రిక వచ్చింది. ఎంతో ఆదుర్దాగా వదిపి శాంతం కూడా చదవాలె, ఇందులో విజ్ఞాన విషయాలు చాలా ఉన్నవని, సరదా వడి పరుగు పరుగున ఇంటికివచి

పాటచేస్తున్న కాంతంతో "ఇదుగో పరిమళపత్రిక వచ్చింది. మంచి విషయాలున్నవి చదువు" అని చేతికిస్తే తీసికొని నే, నటు పోగానే చ్చారు రాచిప్పమీద మూత పెట్టింది! నేను వచ్చిచూచి విచారపడుతుంటే నవ్వుతుంది! అప్పుడు ఏమిటి అనటం! మళ్ళీ మాట్లాడలేదు.

అటువంటి సమయంలో ఏమాటే ఏమి లాభము? ఆపత్రికయొక్క విలువ దాని కేమి తెలుస్తుంది? ఆపళంగా కూర్చోబెట్టి దానికో నీతిపాఠం చెప్పి ఆ పత్రిక దేశానికి ఎంత ఉపకారం చేస్తున్నదో నీ కేం తెలుస్తుంది కొద్దిగా చదివి వినిపిస్తాను చూడు, అని మురుగేశం పిళ్ళగారి వ్యాసములోనుంచి,

కంబడీ లూలామాలంపు నవ్వడి నెతిగి చూమంకుని భింకంపు బొంకులకు గొంకక నింకెలుగడ్డి—అని చదువుతుంటే, "చాలుచాలు ఆపెయ్యండి ఇవి అరవపాటలు నాకు ఇటువంటి మంగళహారతి వచ్చు. నాతో ఇది తెలుగు అని డబాయిస్తారేం"—అని విరగబడి నవ్వింది. అది అరవ మంగళహారతి గాదు తెలుగు అని చెప్పి ఒప్పించటం నా తరంగాక నేను కూడా నవ్వాలిసి వచ్చింది. ఈ విధంగా ఎన్ని మార్లో నేను ఏదోపని చెయ్యటం కాంతం నవ్వటం సంభవించటం నాకు చాలా కష్టంవేసి ఒక్కమారైనా నామాట నెగ్గించుకొనేటట్లు నడవాలనీ కాంతం జయధ్వజాన్ని పగులగొట్టాలని ఆ విజయపతకాన్ని ముక్కలు ముక్కలుచేయాలని అనిపించింది. సరే అని సమయంకోసం కాచుకొని ఉన్నాను. ఒక రోజు పరీక్ష

వంతులు వస్తున్నారన్న కబురొచ్చింది. తత్సంబంధమైన పను లలోబడి తీవ్రంగా ఆలోచిస్తూ ఉంటే కాంతం వచ్చి,

—ఏమండోయి

—ఊఁ

—మరీ...మాట

—ఊఁ

—ఒకమాట

—అబ్బ! ఏమిటి?

—మరీ—వినరేం;

—అబ్బ! ఏమిటి చాలా పనిమీద ఉన్నాను.

—ఒక్కమాట చెప్పుదుమూ

—ఏమిటి? ఇంత అవసరమైన పనిలో ఉంటే మాట్లా డిస్తావు ఏమిటి? ఊఁ—నీఅవసరం?

—మీరట్లా కోపపడితే నేనేం జెప్పేది. బెండకాయ కూర చేయకుండా పులుసు చేసేదా! పులుసు చేసి బెండ కాయకూర మానేశేదా? లేక రెండు మానేసి కందిపచ్చడి జీలకర్ర వేసి నూరేదా! అని అడిగింది. అప్పుడు నాకు కోపం కూడా వచ్చింది. పుస్తకాలు అటువైపు తోసివేసి ఆలోచిం చాను. ఆసమస్య నాకెటూ తోచలేదు. "బెండకాయ పులుసు మానేస్తే ఏంకూర!" అని "బెండకాయ పులుసు రాదు పులుసుమానేస్తే బెండకాయకూరొస్తుంది." అన్నాడికాంతం? అయ్యబాబో నాకు చిక్కుగా ఉంది. దానిని మీరేమన్నాదు

దగ్గరకు వెళ్లి Simple equation లోకి మార్పించుకో: రా. అప్పుడు చూద్దాం పో వేగిరం పో అని తరిమేసాను.

ఈ పాటి జయానికే నే నెరిగినో సంతోషిస్తుంటే ఆరోజు సాయంత్రమే పరాజయం ప్రాప్తమయింది. అది ఎల్లాగంటే ఆరోజు రాత్రి కాంతం దగ్గుతో బాధపడుతుంటే సొరుగుపెట్టె లోనుంచి దుంపరాష్ట్రికం ముక్క తీసి

—కాంతం దుంపరాష్ట్రికం ముక్క బుగ్గన పెట్టుకో దగ్గు తగ్గుతుంది. అన్నాను.

—అబ్బ దుంపరాష్ట్రికం నాకొద్దు.

—ఎందుకొద్దు?

—నాకు సయించదు.

—సయించటం ఏమిటి? సయించకపోవటం ఏమిటి? మందు లే! బుగ్గన ఉంచుకో.

—నాకొద్దు అంటె.

—ఉంచుకోక తప్పదు. ఎల్లా తగ్గుతుంది దగ్గు? ఈ రాత్రి నీకూ నాకూ కూడా నిద్ర ఉండదు.

—ఆఁ నాకొద్దు.

—వెధవ పెంకితనం ఉంచుకో అన్నాను గట్టిగా.

—నేను ఉంచుకోనంటె ఏమిటి బాధ అన్నది.

—మరి తప్పదు. తీసుకో నాకు కోపం వస్తుంది అని గట్టిగా అన్నాను. మొగాడికి ఆమాత్రం అధికారం అయినా ఉండొద్దూ ఆడదానిమీద! అని కొంచెం కోపంగానె అన్నాను.

కాంతం నాకు కోపంవస్తుందని భయపడ్డదికాబోలు సరే తెండి అన్నది "ఆ అల్లా దారికి రా. ఎప్పటికి అల్లాంటి పెంకె తనం చెయ్యకేం నాదగ్గర సాగదు జాగ్రత్త అని గర్వంగా అన్నాను. కాంతం దుంపరాష్ట్రికంముక్కను మొదలకుండా తీసికొంది.

కాంతం పెంకెతనం ఈవిధంగా అణచుకొని రావాలె. ఈ విధంగా గద్దించి భయపెడితే భయభక్తులలో ఉంటుంది అని అనిపించింది ఆక్షణంలోనే. ఇకముందు ప్రతివిషయంలోనూ ఇదేవిధంగా నామాట సాగించుకోవాలెనని తీర్మానించుకొన్నాను. నామాట సాగుతున్నదని అదేమిటో పిచ్చిసంతోషం వేసిందినాకు. నాలో నేను నవ్వుకొన్నాను.

ప్రొద్దున కోపించడం కొంచెం లాభించిందని అనుకొన్నాను. భార్యను అల్లా భయభక్తులలో ఉంచాలరానాయనా అని మాతాత అన్నాడు. నాకుకూడా అదేమార్గం అనిపించింది; కాంతం పాపం నావంకజూచి ఒక చిరునవ్వు నవ్వింది ఎందుకో?

మంచంమీద నడుమువాల్చాను. కాంతంయింకా దగ్గుతునే ఉంది. ఎంతసేపటికీ ఏమాత్రం శాంతిలేదు. గంటా రెండు గంటలయింది. ఏసుబ్బా ఈపాటికి కొంతశాంతి కలుగుతుందే, లని దగ్గరకువెళ్ళి చూద్దునుగదా కాంతం దుంపముక్క ముక్కపాళంగా అరచేతిలో పెట్టుకొని బుగ్గకు ఆనించుకుని పడుకొన్నది. "ఇదేమిటె? నీతెలివి తెల్లవారా! అంటే "మీరు

బుగ్గను ఉంచుకోమంటే బుగ్గనే ఉంచాను. నోట్లో వేసుకో లేదుగా! అని అన్నది ఇంకేమి మాట్లాడేది?

ఇన్నిమార్లు ఈవిధంగా అవమానాలన్నీ నెత్తిని వేసుకొని పైకి చిరునవ్వుతో ఊరుకొన్నాను. అయితే, ఆరోజు హోటలులో భోజనానికి వెళ్ళిపోయేటంతకోపం ఎందుకొచ్చిందంటే కారణం ఇది.

నాస్నేహితుడూ నేనూ భోజనంచేస్తున్నాము. కాంతం వడ్డిస్తున్నది. స్నేహితుడు కొంచె మొగమోటస్థుడగుటచేత నేను కొంచెం బలవంత పెడుతున్నాను. బీదసంసారాలలో ఎక్కడకూరలుకొని గొప్పగా విందుచేయగలము! అందుకని ఏదో మనయింట్లోఉన్న గోంగూరపచ్చడితోనే వారికి విందు కల్పించి విస్తరిలో బీదతనం కనబడుతున్నా మాటలలో లేకుండా; బంగాళాదుంపలు ఓడలు రాకపోవడంచేత మంచివి దొరకటంలేదు. కుళ్ళిపోయినవి బజారులో ఉన్నవనీ, మిగతా కాయకూరలు ఏవి తాజావి లేవనీ, ఎన్నాళ్ళక్రిందనో కోసిన పొట్లకాయలుకొని కూరవండించి స్నేహితులకు పెడితే జబ్బు పడతారనే భయంతో ఏదో పథ్యముగానే జరిపి ఆరోగ్యం కాపాడితే గొప్ప మేలుచేసినవాడివి అవుతావని తలంచితినని, ఏవో నాలుగుమాటలు చెపుతున్నా. చేరునివస్తువులను ఆవిధంగా దూషించి చేసిన వస్తువులను కొంచెం పొగడటం మొదలుపెట్టి, వాళ్లు గోదావరితీరవాసులగుటచేత, గోంగూర సుగుణాలుచెప్పి, క్షాన్యేయుశాస్త్రంలో కూడ దానిని నిషేధించి

నట్లు నిదర్శనాలు లేవని ప్రపంచంలో (గ్లోబులని) ఎందుకన రాదు గ్లోబులో ఎక్కడైన గోంగూర పండుతుందా?) కల్లా ప్రసిద్ధిచెందిన గుంటూరు గోంగూరతో ఆపచ్చడి తయారు చేయబడ్డదనీ, (అది నిజానికి గుంటూరు గోంగూర కాదు.) ఏమేమో తియ్యని మాటలు ప్రేమకొద్దీ నేను నాస్నేహితు నకు చెప్తూవుంటే ఈకాంతం—ఆమాట తెల్సికొంటే యిప్పుడు నాకు నవ్వువస్తుంది, అప్పుడు పళ్ళు మండిపోయింది, వంటయింట్లోనుంచి పనివేళవచ్చి సన్నగా—"మనం గుంటూ రునుంచి గోంగూర ఎప్పుడు తెప్పించాము!" అన్నది.

అదివరకే నేను బాగాళాదుంపలు బజారులోనే లేవని తాజాకూరలు అసలులేవని, చెప్పటం కొంచెం కోతలని సందే హిస్తున్న స్నేహితులు ఈమాటలు విని,— "కోస్తున్నావు నాయనా" అనివిరగబడి నవ్వారు. కాంతం వంటయింట్లోకి వెళ్లింది. అక్కడ నవ్వుతున్నదని నాకు తెలుసు. మాయింట్లో వాళ్ళుకూడా నవ్వుతున్నారు. ఇల్లంతా నాటకంలో విదూష కుని మాటలు విన్నట్లు విరగబడి నవ్వుతున్నారు. నవ్వకుండా ఉన్నది నేనొక్కణ్ణి. ఇక మాబావమరిది విస్తరిముందరినుంచి లేచి, గంతులేస్తున్నాడు సంతోషం పట్టలేక.

నాకు ఉడుకుమోతుతనంవచ్చి కాంతంతో "ఆ ఏమిటి అది? మొన్న మీ అక్కయ్య తీసుకొని రాలేదా?" అన్నాను. కాంతం "అవును మరిచిపోయినాను" అన్నది. అయినా ఆ మాట ఎవ్వరూ నమ్మేటట్టులేదు. ఆ అనటంలోనే వ్యతిరే

కార్థం స్ఫురించిందికాబోలు ఇల్లంతా నవ్వాడు. ఇక లాభం లేదని నేనుకూడా ఒక చిరునవ్వు ఆనవ్వు ప్రవాహంలో పారేశాను. కలిసికొట్టుకోపోయింది అది.

ఇప్పుడింత కులాసాగా చెప్పినా ఆరోజు ఒళ్ళు మండిపోయింది. ఇంట్లో ననేమిరా భోజనం చెయ్యనన్నాను. ఆవళంగా హోటలుకు బయలుదేరాను. అప్పటికి పొద్దుటినుంచి కాంతంతో పోట్లాడుతూ కూర్చోటంవల్ల షుమారు పదకొండు గంటలయింది.

కాంతంతో పోట్లాడిబయలుదేరటంచేత చాలా కోపంగా బయలుదేరినాను. అదివరకెప్పుడూ తరుచుగా వంటపూటి యింట్లో భోజనం చేసినవాణ్ణి కాను. అయితే అరవవాడి హోటలు చాలా సౌకర్యంగా ఉంటుందని విన్నాను అందుకని అరవహోటల్లు ఎక్కడా అని విచారిస్తూ వెళ్లాను. ఒక చోట బల్లపై — "ఇక్కడ అన్నము వేయుబడును", అని వ్రాసిఉంది. అన్నం వేయబడునా? ఏమిటిది! ఇదేమి ప్రయోగం? గొడ్లకు మేతవేస్తాముకాని మనుషులకు మేతవేస్తామా! అని నాలో నేను తర్కించుకొని, నవ్వుకొంటూ లోపలికి పోవాలని తలుపు తట్టాను. లోపల ఎవరో

ఎవరు మీరు? అన్నాడు.

తలుపు తీయవయ్యా.

ఎవరు మీరు?

తలుపు తీయవయ్యాగోల.

లోపలనుంచి ఒక మనుష్య రూపమువచ్చి నిలబడ్డది. నల్లటి మురికిబట్ట కట్టుకొన్నాడు. వచ్చి యేూరు ? అన్నాడు.

—ఏబ్బే ! ఏమిలేదు. ఇక్కడ అన్నం పెడతారా ?

—ఊం వేస్తురు.

—వెయ్యిమరి.

—'టికెట్ కొనుమూ' అన్నాడు.

సరేఅని టికెట్ కొన్నాను. విస్తరిముందు కూర్చున్నాను. వాడు వచ్చి 'మెతుకులు వేయనా ?' అన్నాడు. నావళ్ళు మండింది. మెతుకులు వేయటం ఏమిటి?. వాడికిపిండం ! నే నేమన్నా జబ్బువాడినా?. వీడిదుంప......నాకేమైనా పథ్యం పెడతాడా? అని భయంవేసింది. ఇంతలో వాడువచ్చి నిజంగా రెండు మెతుకులు విస్తట్లో వేశాడు. ఆ మొదటివాయి నాకు నిజంగా పచ్చడిలోకి సరిపోలేదు. మళ్ళీ అన్నం అని కేకేశాను. మళ్ళీ వాడు రెండు మెతుకులు చూపిస్తూ" ఇదంతా వెయ్యనా, అన్నాడు. "అదంతా ఇంకా మూడింతలు వెయ్యవోయి నన్ను చంపక" అన్నాడు. ఎందుకో కోపమువచ్చి నావిస్తట్లో ఆపళ్ళెంలోఉన్న సాదం అంతా గిరాటువేసి వెళ్ళిపోయినాడు.

నెయ్యి వేయటానికి వచ్చాడు. చేతిలో నేతిగిన్నెఉంది. అగిమాటుకు సత్యం—అడుగున నెయ్యి ఉందో లేదో భగవంతుడికి తెలియాలిసిందే. నిజంగా యేమి తెలుస్తుంది?. బంగాళాఖాతం అడుగున ఏముందో తెలిసికోటం కష్టంకాదు కాని,

ఆగిన్నె అడుగులో ఏమున్నదో తెలిసికోటం కష్టము. ఏమీ లేదు, అని నేను అనలేను. ఎందుచేత నంటే— Full many a gem of the Purest ray serene, the dark unfathomed caves of oceans bear— అన్నాడు. ఆపళంగా వాడు ఆగిన్నెలోని ఆఖాతంలోకి ఒక పొడుగైన గరిటెను పోనిచ్చి పైకి బహు నేర్పుగా లాగి దానిని అమాంతంగా నా నెత్తిమీదుగా ఒక మైలుదూరం పైకెత్తి, గంటెను వంచాడు. ఆపైనుంచి హిమాలయ పర్వతము మీదినుంచి గంగలాగ పడుతుందేమో, అని భ్రమ, పడ్డానుగాని ఏమిపడ్డదో తెలియదు.

కూర అన్నం తినకముందే గోకర్ణంతో పులుసు తెచ్చి 'సాంబారు' 'సాంబారు' అని అరిచాడు. నన్ను సరిగా భోజనం చెయ్యనివ్వడురా అనుకొని, ఆలస్యం చేస్తే, మళ్ళీ రాడేమో అని భయంవేసి, ఆకూర అన్నం ఒకవైపుకు నెట్టి సాంబారుతో అన్నం కలిపాను. అది తిని తరువాత రసంతో రెండుమెతుకులుతిని మజ్జిగతో కూడా కొంచెంతిని, లేచాను. విస్తారం తింటే వాడు ఏమనుకొంటాడో అని భయం వేసింది.

వెళ్ళిపోవాలని చొక్కా వేసుకొని వెళ్ళబోతుంటే— యక్స్ట్రా సార్ అన్నాడు. పెరుగు వేసినందుకు నెయ్యివేసినందుకు ప్రత్యేకంగా చార్జిచేశాడు. మొత్తంమీద పది అణాలయింది. డబ్బు అంతా యిచ్చిన తరువాత వాడు పొగాకు నములుటచేత నల్లబడ్డపళ్ళు బయటపెట్టి వూడు

స్తారా; అన్నాడు.

—ఏమిటి?

—వూడుస్తారా!

—ఎవరిని?

—ఏమి సార్? యిప్పుడు వూడుస్తారా?

ఇప్పుడు కాదులే రేపొచ్చి అని సాగాను అదేమిటో వూడవాలని నాకు భయాం వేసింది. అదేమి గుంటో గొంతెమ్మో అనుకొన్నాను.

ఈవిధంగా అర్ధకూడు తిన్నాను. కాంతంమీద కోపం చేత వూటకూలి యింటికి వచ్చి, తగిన శిక్ష అనుభవించా నని అనుకొన్నాను. ఇంటికివెళ్ళాను. కాంతం రోజవలె పడకగదిలో లేదు. వంటయింట్లోకి వెళ్ళాను. అక్కడ పీట మీద చెంగుపరచుకొని పడుకొన్నది. అప్పటికి రెండు అయింది. పాపం అప్పటికి భోజనం చెయ్యక నాకోసం కని పెట్టుకొని కూర్చున్నది. నాకు కాంతాన్ని చూస్తే జాలి వేసింది. పాపం నాకోసం యింతవరకూ మాడుతూఉన్నదే అనిపించింది.

నన్ను చూచి కాంతం లేచింది. విచారపడ్డట్టు ముఖలక్షణాలు చెబుతున్నవి.

—లే! ఇంకా భోజనం చెయ్యలేదా?

—లేదు. మీరురాందే.

—నేను లేకపోతే నీవు తినకూడదూ.

—నామనస్సొప్పదు.

—సరే యిప్పుడు తిను

—మీరుతినంది నేనుతినను

—నేనెక్కడైనా తినొస్తే?

—రాత్రిదాకా యిల్లాఉంటాను.

—ఆమాటవిని కాంతానికి నామీద ఎట్టి నిజమైన ప్రేమ ఉందో గ్రహించాను. అంతకుముందు హోటలులో అర్థాన్నమే తిన్నాను. కాబట్టి సరేలే, వడ్డించు అన్నాను.

—కాంతాన్ని బలవంతపెట్టి రెండువిస్తళ్ళలో ఒక్కమారే వడ్డనచేయించి, ఇద్దరం ఒక్కసారే కూర్చొని సరదాగా తిన్నాము.